ప్రజాశక్తి

శుక్రవారం 12 సెప్టెంబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

గుంటూరు, పల్నాడుకు కొత్త కలెక్టర్లు

గుంటూరుకు తమీమ్ అన్సారియా, పల్నాడుకు కృతికా శుక్లా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ఎస్.నాగలక్ష్మీ, పి.అరుణ్‌బాబుబదిలీ అయ్యారు. ఈమేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరికింకా ఎక్కడా పోస్టింగ్‌లు ఇవ్వలేదు. గుంటూరు నూతన కలెక్టర్‌గా ప్రకాశం కలెక్టర్‌గా పనిచేసిన తమీమ్ అన్సారియాను నియమించారు. 2015 బ్యాచ్‌కు చెందిన ఆమె ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో గత 15 నెలలుగా పనిచేస్తున్నారు. పల్నాడు జిల్లా కలెక్టరుగా ఇంటర్ బోర్డు డైరెక్టరు పనిచేసిన కృతికా శుక్లాను నియమించారు. 2013 బ్యాచ్‌కు చెందిన కృతికా శుక్లా గతంలో గుంటూరులో జాయింట్ కలెక్టరుగా, కాకినాడ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు.



గుంటూరు, పల్నాడు కలెక్టర్లు తమీమ్ అన్సారియా, కృతికా శుక్లా

గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మీ 2015-17 మధ్య కాలంలో గుంటూరు మునిసిపల్ కమిషనర్‌గా పనిచేశారు. 2024 జులైలో ఆమె గుంటూరు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. దాదాపు 15 నెలలు పాటు కలెక్టరుగా పనిచేసిన ఆమె వివాదాలకు అతీతంగా పనిచేశారు. జిల్లాపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగిన గుంటూరు అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించేలోపే బదిలీ జరిగింది. రాజధాని జిల్లా కావడంతో ఆమె గత 15 నెలలు కాలంలో ఎక్కువగా ప్రోటోకాల్ విధులకే సమయం కేటాయించాల్సి వచ్చింది. గతంలో అనంతపురం, విజయనగరం జిల్లాల కలెక్టరుగా పనిచేసిన అనుభవంతో సీనియర్ ఐఎఎస్ అధికారిగా ఆమెకు కూటమి ప్రభుత్వం 15 నెలల క్రితం ఆమెను జిల్లా కలెక్టరుగా నియమించారు. అయితే తక్కువ కాలంలోనే ఆమె బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లాలో జాయింట్ కలెక్టరుగా పనిచేసిన కృతికా శుక్లా పల్నాడు జిల్లాపై కూడా అవగాహన ఉంది. ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న తమీమ్ అన్సారియా ప్రతిష్టాత్మకమైన రాజధాని జిల్లాకు రానున్నారు. తమీమ్ అన్సారియా 2015లో ఎపి కేడర్‌కు చెందిన డైనమిక్ అధికారిగా పేరుగాంచారు. ఆమె 1988 డిసెంబరు 31న తమిళనాడులో జన్మించారు. బిఈలో కంప్యూటర్ సైన్స్, ఎంఎ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చేశారు. 2014లో 26 ఏళ్ల వయస్సులోనే ఆమె యుపిఎస్‌సిలో సివిల్ సర్వీసు పరీక్షలు రాశారు. ఆలిండియాలో 314 ర్యాంకు సాధించారు. ఈమె భర్త డాక్టర్ మనజీర్ జిలాని కూడా ఐఎఎస్ అధికారి. ఆయన రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

గతేడాది ఆగస్టు 7న పల్నాడు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అరుణ్‌బాబు జిల్లాకు విశేష సేవలందించారు. గ్రీవెన్స్‌కు వచ్చే ప్రజల కోసం కలెక్టరేట్ ప్రాంగణంలో షెడ్ నిర్మించారు. ప్రజలు అర్జీలు రాయించుకునేందుకు గతంలో బయటి వ్యక్తులకు నగదు చెల్లించాల్సిన పరిస్థితుల దష్ట్యా అర్జీలు ▶ 2లో

స్మార్ట్ రేషన్ కార్డులను ఇంటింటికీ ఇవ్వాలి

తప్పులను ప్రభుత్వమే ఉచితంగా సరిచేయాలని : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వం ఇస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల్లో తప్పులను ప్రభుత్వమే ఉచితంగా సరిచేయాలని, కార్డులను ఇంటింటికీ పంపిణీ చేస్తామని చెప్పిన మాటను అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ కోరారు. పాతగుంటూరులోని సుందరయ్య భవన్‌లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సాధారణ రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్‌కార్డులు తీసుకురావడం మంచిదే అయినా ఈ కార్డుల్లో వచ్చిన తప్పులకు ప్రభుత్వానిదే బాధ్యత కాబట్టి వాటిని ఉచితంగా సరిచేయాలన్నారు. ఎక్కువ కార్డులలో పేర్లు, బంధుత్వం వంటి ఇతర తప్పులు వస్తున్నాయని, ఇవి ప్రజలు అప్లికేషన్ పెట్టడం వల్ల వచ్చిన తప్పులు కాదని అన్నారు. ప్రభుత్వం వద్ద ఉన్న డేటా అధారంగా స్మార్ట్ కార్డులు ఇస్తున్నారని, వీటిని సరిచేసుకోవాలంటే మీ-సేవ కేంద్రాల్లో అప్లికేషన్ పెట్టుకోవాలని చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారని అన్నారు. వీటి భారం ప్రజలపై వేయడం సరికాదని, ప్రభుత్వం చేసిన పొరపాటుకు ప్రభుత్వమే బాధ్యత వహించి సరిచేయాలని డిమాండ్ చేశారు. నూతన కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవటానికి, కార్డుల్లో ఫ్యామిలీ



విలేకర్లతో మాట్లాడుతున్న నేతాజి

డివైడ్ చేసుకోవటానికి, పాత కార్డుల్లో మార్పులు చేర్పులకు అవకాశం ఇవ్వాలని కోరారు. కొత్త కార్డు కోసం, కార్డుల విభజన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని వెంటనే వీటికి అవకాశం కల్పించాలని కోరారు. అదే విధంగా కొత్తగా ఇస్తున్న స్మార్ట్ కార్డులు ఎక్కడ ఉన్నాయో ప్రజలకు అర్థం కావట్లేదన్నారు. కొన్ని కార్డులు రేషన్ షాప్‌లలో, కొన్ని సచివాలయాలలో, మరికొన్ని వేరేచోట ఇలా..ఎక్కడ ఉన్నాయో తెలియక అయోమయంలో ఉన్నారన్నారు. లబ్ధిదారులు వీటి చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సచివాలయ అధికారులు ఇంటికి వచ్చి స్మార్ట్ ఇస్తారని ప్రభుత్వం చెప్పినా ఆచరణలో అమలు జరగట్లేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.



సత్కారం పొందుతున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీలు

నోబెల్ గ్రహీతలను పిలిపించండి

- విద్యార్థులకు వారిని పరిచయం చేసి స్ఫూర్తి నింపాలి
- ఎఎన్‌యు వ్యవస్థాపక దినోత్సవంలో మాజీ వీసీల సూచన
- వర్సిటీ అభివృద్ధితో తమ భాగస్వామ్యంపై అనుభవాల కలబోత

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 49వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వర్సిటీకి గతంలో వీసీలుగా పనిచేసిన వారంతా గురువారం ఒకే వేదికపై కనిపించారు. తమ అనుభవాలను పంచుకోవడంతోపాటు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వర్సిటీ మరింత అభ్యున్నతి సాధించడానికి చేపట్టాల్సిన చర్యలపై సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డి.రామకోటయ్య మాట్లాడుతూ వీసీ బాధ్యత అలంకారప్రాయమైందని కాదని, ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని చెప్పారు. వీసీగా తాను తీసుకువచ్చిన ఆర్థిక స్థిరత్వం ఫలితాలు నేడు కనిపిస్తున్నాయని, తన హయాంలో పెన్షన్ నిధి రూ.10 కోట్ల నుండి రూ.50 కోట్లకు పెరిగిందని తెలిపారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి ప్రభుత్వాల ప్రోత్సాహం అవసరమన్నారు. ప్రొఫెసర్ సివి రాఘవులు మాట్లాడుతూ వర్సిటీ సొంత భూమిని కాపాడటానికి కృషి చేశానన్నారు. సంబంధిత డాక్యుమెంట్లను తెప్పించి వాటి ఆధారంగా, ప్రాంగణం చుట్టూ రక్షణ గోడను నిర్మించామని, గో గ్రీన్ మూమెంట్ ద్వారా 180 ఎకరాల్లో మొక్కలు నాటించామని, ఇందుకుగాను ప్రభుత్వం నుండి రూ.30 లక్షలు గ్రాంట్ సాధించామని తెలిపారు. ప్రొఫెసర్ ఎల్.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తన హయాంలో అనేక సంస్కరణలు తెచ్చామని, దూరవిద్య కేంద్రం ఏర్పాటు ద్వారా వర్సిటీ ఆర్థిక పరిపుష్టికి దోహద పడిందని అన్నారు. విద్యా విధానంలో వార్షిక పరీక్షల నుండి సెమిస్టర్ పరీక్షల విధానం ఆనాడే ▶ 2లో

నీటి కాలుష్యం వల్లే మరణాలు

తురకపాలెంలో పరిశీలన వివరాలను వెల్లడించిన డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్



ప్రజాశక్తి - మంగళగిరి

తురకపాలెంలో అంతు పట్టని మరణాలకు నీటి కాలుష్యం కారణమని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధక్షులు డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్ తెలిపారు. ఇటీవల ఆ గ్రామంలో ప్రజా ఆరోగ్య వేదిక బృందం పర్యటించిన సందర్భంగా వివరాలను ఆయన గురువారం వెల్లడించారు. మరణాలకు మతం రంగ పులమడం, విశ్వాసాలకు ఆపాదించే ప్రయత్నాలు సరికాదన్నారు. కొంతకాలంగా గ్రామంలో దాదాపు 100 మంది అంతుచిక్కని వ్యాధితో మరణించారనే సమాచారంతో తమ బృందం ▶ 2లో



జనం కోసం జీవితాన్ని అంకితం చేసిన ఏచూరి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మార్క్సిజాన్ని నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించిన ప్రజా నాయకుడు సీతారామ్ ఏచూరి అని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల అధ్యక్షతన గురువారం జరిగింది. సీతారాం ఏచూరి ▶ 2లో

తురకపాలెంలో మరణాలపై ఆడిటింగ్

మట్టిలో బ్యాక్టీరియాపై అధ్యయనం - ప్రజాశక్తితో గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



తురకపాలెంలో సంభవించిన అసాధారణ మరణాలపై అధ్యయనం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన గత 10 రోజుల కాలంలో తీసిన రక్త నమూనాల పరీక్షల్లో ఇద్దరికి మాత్రమే బ్యాక్టీరియా మెలియాయిడోసిస్ నిర్ధారణ అయిందన్నారు. మట్టి నమూనా పరీక్షల నివేదిక రావాల్సి ఉందన్నారు. మట్టిలో కూడా మెలియాయిడోసిస్ బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉందన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు అంశాలు తెలియజేశారు.

తురపాలెం మరణాలకు కారణాలు తెలిశాయా?

తురకపాలెంలో సంభవించిన ఆసాధారణ మరణాల్లో ఎక్కువ మందికి ఎటువంటి బ్యాక్టీరియా లక్షణాలూ లేవు. పరీక్షల్లో ఇద్దరికి మాత్రమే ▶ 2లో

నీటి కాలుష్యం వల్లే మరణాలు

(మొదటి పేజీ తరువాయి)

గ్రామంలోని అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించిందని, నీటి కాలుష్యం వల్లే వ్యాధులు ప్రబలినట్లు తాము గుర్తించామని చెప్పారు. ప్రభుత్వం రక్షితనీటి సరఫరాను ఆ గ్రామానికి ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు వ్యాధులకు గురైనట్లు తెలిపారు. మందులు పెట్టి క్వారీలు పగలగొట్టినప్పుడు ఆ రసాయనాలు నీటిలో కలిసి కలుషితమై ఉండవచ్చని, ఆ నీటిని వాడడం వల్ల అక్కడి ప్రజలకు జ్వరాలు, కణుతులు, కీళ్ల వాపులు మొదలగు లక్షణాలతో మరణాలకు దారితీశాయని అన్నారు. చాలామందికి మెడ దగ్గర వాపు, పొట్ట దగ్గర వాపు గడ్డలుగా ఏర్పడి సర్జరీ చేసిన తర్వాత కూడా చనిపోయారని తెలిపారు. యాంటీబయటిక్ మందులను వాడాల్సి ఉందని తెలిపారు.

గుంటూరు, పల్నాడుకు కొత్త కలెక్టర్లు

(మొదటి పేజీ తరువాయి)

రాసేందుకు కలెక్టరేట్ ఉద్యోగులను నియమించారు. ప్రభుత్వ విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు లక్ష్య సాధన మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేశారు. పల్నాడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. మితభాషి, ముక్కు సూటిగా వ్యవహరిస్తారనే పేరుంది.

జనం కోసం జీవితాన్ని అంకితం చేసిన ఏచూరి

(మొదటి పేజీ తరువాయి)

చిత్రపటానికి విజయ్‌కుమార్‌తోపాటు ఇతర నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడుతూ భారతదేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారని అన్నారు. విద్యార్థి దశ నుండి అంచెలంచెలుగా ఎదిగారని చెప్పారు. నిరంతరం శ్రామిక జీవుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. భారతదేశంలో ఉన్న రాజకీయాలు పెను మార్పులకు గురవుతున్నాయని, కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం చట్టాలను తన ఇష్టం వచ్చినట్లు మార్పుతూ ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగంలోని విశాఖ ఉక్కును 33 భాగాలుగా విభజించి ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు అమ్మటానికి పావులు కదుపుతోందని, ఈ చర్యలను ప్రజలంతా ఐక్య పోరాటాలతో అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను బలవంతంగా అమలు చేస్తే ఏమవుతుందో మన చుట్టుపక్కలున్న శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల పరిస్థితులను ప్రధాని మోడీ పరిశీలించాలన్నారు. ప్రజలను తిప్పలుపెట్టే ప్రభుత్వాలు మనుగడ సాగించలేవన్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, నాయకులు ఎ.వీరబ్రహ్మం, ఎం.జ్యోతి, పి.మహేష్, ఎం.హరిపోతురాజు, పి.సూర్యప్రకాశరావు, జి.రజిని పాల్గొన్నారు.

రెంటపాళ్లలో వృద్ధురాలి నేత్రదానం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని రెంటపాళ్ళ గ్రామానికి చెందిన రామిశెట్టి లక్ష్మమ్మ (74) వృద్ధాప్యంతో గురువారం మృతి చెందారు. లక్ష్మమ్మ కుమారుడు రామిశెట్టి ఆంజనేయులు తల్లి నేత్రాలను చిరంజీవి ఐ బ్యాంకుకు దానం చేశారు. విజయవాడకు చెందిన ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్యులు వచ్చి వృద్ధురాలి కళ్లను సేకరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు పలువురు అభినందించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు రామచంద్రరావు, కట్టికోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తురకపాలెంలో మరణాలపై ఆడిటింగ్

(మొదటి పేజీ తరువాయి)

నిర్ధారణైంది. మట్టి నమూనాల్లో పరీక్షల నివేదికలు రావాల్సి ఉంది. గత పదేళ్లల్లో జరిగిన మరణాలు, ఏడాదికి ఎన్ని జరిగాయి? సాధారణ మరణాల కంటే ఎక్కువగా ఉన్నాయా? అనే కోణంలో డెత్ ఆడిట్ జరుగుతోంది. బ్యాక్టీరియా వల్ల మరణాలపై కూడా పరిశోధన జరుగుతుంది.

మట్టి ద్వారా బ్యాక్టీరియా ఎలా వస్తుంది?

వ్యవసాయపనుల్లో పాల్గొనే వారికి శరీరంపై ఎక్కడైనా గాట్లు, చీరికలు, రక్తస్రావమయ్యే పరిస్థితులు ఉంటే మట్టిలోని బ్యాక్టీరియా సంబంధిత వ్యక్తికి వ్యాపించే అవకాశం ఉంది. వ్యవసాయ పనుల్లో పాల్గొనే వారు తప్పని సరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. గతంలో మరణించిన వారిలో ఇలాంటి వ్యవసాయ పనుల్లో పాల్గొంటూ మరణించిన వారు ఉంటే వారి వివరాలపై కూడా అధ్యయనం చేస్తాం.

అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం?

పెదకాకాని, చేబ్రోలు, దుగ్గిరాల, కొల్లిపర మండలాల్లో గతనెలలో కురిసిన అధిక వర్షాల వల్ల ప్రాథమిక దశలోఉన్న పైర్లకు నష్టం జరిగింది. అయితే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పంట ఉత్పత్తి వచ్చే దశలో నష్టం జరిగితేనే పరిహారం ఇస్తారు. నష్టపోయిన రైతుల జాబితాలను తయారు చేయిస్తున్నాం. అయితే కనీసం రెండో సారి సాగుకు విత్తనాలు ఇవ్వని ప్రభుత్వాన్ని అడిగాం.

గుంటూరు ఛానల్ భూసేకరణ?

గుంటూరు ఛానల్ విస్తరణ, పొడిగింపునకు సంబంధించిన భూ సేకరణ తొలి దశలో ఏడు గ్రామాల్లో ప్రారంభిస్తున్నాం. ఈ గ్రామాల్లో ఇప్పటికే నోటిఫికేషన్‌లు ఇచ్చాం. త్వరలో ఆర్‌డిఓ గ్రామసభలు నిర్వహించి స్వచ్ఛందంగా ఇచ్చే వారి వివరాలు సేకరిస్తాం. ఇవ్వని వారి నుంచి చట్ట ప్రకారం సేకరణ ద్వారా తీసుకుంటాం. మరో నాలుగు గ్రామాలకు సంబంధించిన భూ సేకరణ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. బాపట్ల జిల్లా పరిధిలోని గ్రామాలకు ఆ జిల్లా అధికారులు నోటిఫికేషన్ ఇస్తారు.

మంగళగిరిలో గోల్డ్ ,డైమండ్ పార్కుకు భూ సేకరణ?

ఈ ప్రాజెక్టుకు సంబంధించి దాదాపు 80 ఎకరాల భూమి దాదాపుగా అంతా అసైన్డ్ ల్యాండు ఉంది. దీనిని తీసుకునేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం రెండ్రోజుల క్రితం ఉత్తర్వులిచ్చింది.

గుంటూరు బిఆర్ స్టేడియం అభివృద్ధి?



గుంటూరులోని బిఆర్ స్టేడియం అభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఖేలో ఇండియా పథకం ద్వారా ప్రతిపాదనలు చేశాం. ఇంకా అనుమతులు రావాల్సి ఉంది.

గుంటూరులో డ్రైయినేజ్ వ్యవస్థ మెరుగునకు చర్యలు?

గుంటూరులో డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుకు చర్యలు తీసుకుంటున్నాం. గత రాత్రి కురిసిన భారీ వర్షానికి కొన్ని ప్రాంతాల్లో నీరు నిలిచింది. డ్రెయినేజీల నిర్మాణం చేపట్టినప్పటికీ పూడిక పనులు సకాలంలో చేయకపోవడం వల్ల వర్షపు నీరు పారుదల లేక ఎక్కడి కక్కడ నిలిచిపోతుందన్న ఫిర్యాదులున్నాయి. రాత్రి పొద్దుపోయిన తరువాత భారీ వర్షం కురవడం వల్ల కంకర గుంట ఆర్‌యుబి, మూడు వంతెనల వద్ద ట్రాఫిక్ సమస్య ఎక్కువగా రాలేదు. పగటి పూట అంత వర్షం కురిస్తే చాలా ట్రాఫిక్ సమస్యలు వచ్చేవి.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నోబెల్ గ్రహీతలను పిలిపించండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమైందని, మొదటిసారిగా నాక్ 'బి' ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించామని చెప్పారు. ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ దేశంలో 400 యూనివర్సిటీలను సందర్శించానని, అందమైన కట్టడాలు, రూపకల్పన అంశంలో జాతీయ అత్యుత్తమ విశ్వవిద్యాలయాల సరసన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిలిచిందని చెప్పారు. తన హయాంలో అవినీతికి తావు లేకుండా నాణ్యమైన భవన నిర్మాణాలు జరిగాయని చెప్పారు. వర్సిటీల్లో రాజకీయాలకు ఎట్టి పరిస్థితుల్లో తావుండకూడదన్నారు. ప్రొఫెసర్ వైఆర్.హరగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తన హయాంలో దూరవిద్య కోర్సులకు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఆమోదం లభించిందన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో అనుబంధ కళాశాలల సహకారం విలువైందని చెప్పారు. మెగా డీఎస్సీ మాదిరిగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రొఫెసర్ ఎ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ స్వర్ణోత్సవాల్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న నోబెల్ అవార్డు గ్రహీతలను పిలిపించి విద్యార్థులకు పరిచయం చేయాలని సూచించారు. తన హయాంలో క్రీడలకు పెద్దపీట వేశామని, రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో సింథటిక్ ట్రాక్ నిర్మాణం ద్వారా క్రీడాకారులకు అంతర్జాతీయ సదుపాయాలు కల్పించినట్లయిందని అన్నారు. పిటి.ఉష, కరణం మల్లేశ్వరి, పుల్లెల గోపీచంద్ లాంటివారు వర్సిటీని సందర్శించి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారన్నారు.

తొలుత రెక్టార్ ప్రొఫెసర్ రత్నశీలామణి అధ్యక్షతన నిర్వహించిన సభలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి మాజీ వీసీల దూరదృష్టి ఎంతో ఉపయోగపడిందన్నారు. భావితరాలకు ఆదర్శంగా భవిష్యత్తు ప్రణాళికలు ఉండాలన్నారు. ఏడాది పాటు నిర్వహించే వర్సిటీ వ్యవస్థాపక వేడుకలకు సూచనలివ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందిన విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు జి.చెన్నారెడ్డి, పిపిఎస్ పాల్‌కుమార్, వి.దివ్య తేజ మూర్తి, రమేష్ రాజు, పి.సుధాకర్‌ను అతిథులు సత్కరించారు. ఉద్యోగ విరమణ చేయనున్న ఉద్యోగులు ఎ.శివప్రసాదరావు, కె.సుబ్బారావు, డి.శివకుమారి, షేక్ బషీర్ అహ్మద్, ఎమ్మెన్ కోటేశ్వరరావు, ఆర్.చిట్టిబాబు, సిహెచ్.సాంబశివరావు, బి.వెంకటేశ్వర్లు, ఎ.వీరయ్య సత్కారం పొందారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు వీరయ్య, సురేష్ కుమార్, లింగరాజు, ప్రమీలారాణి, పాల్ కుమార్, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ సుమంత్ కుమార్, ప్రొఫెసర్ జగదీష్ నాయక్, ఒఎస్‌డి ప్రొఫెసర్ రవికుమార్, సిడిఇ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు, రూసా డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్, సిడిసి డీన్ ప్రొఫెసర్ వి.రవికుమార్. సిడిఇ పరీక్షలు కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ రామచంద్రన్, యూజీ పరీక్షల కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్.వి కృష్ణారావు, నూట అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ బ్రహ్మాజీరావు, ప్రొఫెసర్ త్రిమూర్తిరావు, వికాస అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, శ్రీనివాసరావు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజధాని సమస్యలపై మరోసారి నివేదిస్తాం

ప్రజాశక్తి - తుళ్లూరు : రాజధాని అమరావతిలో నెలకొన్న సమస్యల పై ప్రభుత్వానికి, సిఆర్‌డిఎ అధికారులకు మరోసారి నివేదిస్తామని రాజధాని రైతు జెఎసి నాయకులు స్పష్టం చేశారు. గత నెలలో 15 సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళితే కేవలం మూడు మాత్రమే పరిష్కరించబడ్డాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో హెచ్ఎస్ఆర్ కల్యాణ మండపంలో గురువారం రైతు జెఎసి ఆధ్వర్యంలో వివిధ గ్రామాల రైతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు ధనేకుల రామారావు, జొన్నలగడ్డ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాజధానిలో రోడ్ల నిర్మాణం కారణంగా ఇళ్ళు, స్థలాలు కోల్పోతున్నవారికి న్యాయమైన పరిహారం, ఇతర సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామకంఠాలు, జరీబు భూములను మెట్టగా పరిగణించడం, అసైన్డ్ రైతులకు కౌలు చెల్లింపు తదితర సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. రాజధాని గ్రామాల అభివృద్ధికి డిపిఆర్ రూపకల్పనలో స్థానికుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి నారాయణ, సిఆర్‌డిఎ అధికారులను కలిసి కోరతామన్నారు. ప్రపంచ బ్యాంకు, ఏషియన్ అభివృద్ధి బ్యాంకు బృందం శుక్రవారం తుళ్లూరులో రైతులతో సమావేశ మవుతారనే ప్రచారం నేపథ్యంలో రైతు జెఎసి నాయకులు సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది.

పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

ప్రజాశక్తి-ఈపూరు : స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో పిజిటి ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు వల్లెపు శ్రీను పాఠశాలకు రూ.15 వేల ఫర్నిచర్‌ను వితరణగా అందజేశారు. ఆయన్ను జిసిడిఓ డి.రేవతి, ప్రిన్సిపాల్ పి.పద్మజ అభినందించారు. ఉపాధ్యాయులు సన్మానించారు.

స్వదేశంపై మమకారంతో పేదలకు సహాయం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఎన్ఆర్ఐ గుండవరపు అనిల్ కుమార్ పేదలకు చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్ని స్వదేశీ మమకారంతోనే ఆయన ఈ సేవలు చేస్తున్నారని సామాజిక సేవా కార్యకర్త గంజి వీరాస్వామి అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక పండిన చేనేత సొసైటీ ఆవరణలో గుండవరపు అనిల్ కుమార్ ఆర్థిక సహాయంతో సత్తెనపల్లి చేనేత సొసైటీ ప్రాంతంలో 75 పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు నిరుపేద విద్యార్థులకు ఇద్దరికి సైకిళ్ళు పంపిణీ మరియు 60 వేల రూపాయలతో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఫణిదం చేనేత సొసైటీ అధ్యక్షులు కట్టా శివదుర్గారావు అధ్యక్షత వహించారు. వీరాస్వామి మాట్లాడుతూ అమరావతి మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన గుండవరపు అనిల్ కుమార్ ఉద్యోగం ఇచ్చి అమెరికాలో స్థిరపడినప్పటికీ ఆయనకు స్వదేశంపై మమకారంతో గత 14 సంవత్సరాలుగా తన గ్రామంలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాలలోనూ సత్తెనపల్లి పట్టణంలోనూ ఈ విధమైన సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు అంతేకాక సత్తెనపల్లి పట్టణంలోని పరివర్తన ఆశ్రమ పాఠశాలలోనూ, ఆదరణ అనాధ వఋద్ధాశ్రమంలోనూ, గంజి వీరాస్వామి చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్నారని సత్కరించారు. గుండవరపు అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈ విధమైన సేవా కార్యక్రమాలు అన్నియు కూడా తన తండ్రి వెంకటరావు జ్ఞాపకార్థం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, అవ్వారు రవీంద్రనాథ్ ఠాగూర్,బగ్గి నరసింహారావు, కౌతరపు శ్రీనివాసరావు, కొరారు సంధ్య,వలేటి కుమారి,కర్నాటి మురళీ,కంచర్ల నాగేశ్వరరావు, గంగూరి కళ్యాణ్,గంగూరి సోమనాథ్ ,విద్య ,గుండవరపు అనిల్ కుమార్ కుటుంబ సభ్యులు మరియు ఉంగుటూరు గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు.



విద్యార్థినులకు సైకిళ్లు అందిస్తున్న దాతలు

వీరనారి ఐలమ్మ, రామకృష్ణ స్ఫూర్తితో పోరాటాలు



ఐలమ్మ వర్ధంతి సభలో పాల్గొన్న సంఘ నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-గుంటూరు

భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి బానిసత్వ విముక్తి కోసం పీడిత ప్రజలకు అండగా వీరోచిత పోరాటం చేసిన వీరనారి చిట్యాల ఐలమ్మ ఆశయాల సాధనకై అంకితమై పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక చంద్రమౌళి నగర్ పోస్టాఫీస్ వద్ద చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సభలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిజాం పాలనలో పాలకులు, భూస్వాముల నిరంకుశ విధానాలను ప్రత్యక్షంగా చూసి, సాగుభూమి ద్వారానే ప్రజల జీవన విధానం మారుతుందని గుర్తించిందన్నారు. తాను స్వయంగా కౌలుకు సాగు చేసి పండించిన పంటను భూస్వామి రామ చంద్రారెడ్డి తన అనుచరులతో స్వాధీనం చేసుకోవడానికి చేసిన ప్రయత్నాలకు వ్యతిరేకంగా పీడిత ప్రజలను ఐక్యం చేసి, వీరోచిత పోరాటం నిర్వహించడం ద్వారా ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాంది అయిందన్నారు. ఆ పోరాటం ద్వారా తెలంగాణాలో 10 లక్షల ఎకరాలు పేదలకు భూపంపిణీ జరిగిందన్నారు. అలాగే 2000 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో పెంచిన కరెంటు చార్జీలకు వ్యతిరేకంగా హైదరాబాద్ బషీర్‌బాగ్ వద్ద జరిగిన పోరాటంలో ప్రభుత్వ కాల్పుల్లో ఆంధ్రప్రదేశ్ రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ సత్తెనపల్లి రామకృష్ణ ప్రాణాలు కోల్పోయాడన్నారు. ఐలమ్మ, రామకృష్ణ స్ఫూర్తితో రజకులకు సామాజిక రక్షణ చట్టం తదితర ప్రభుత్వ హామీల సాధన కోసం పోరాడాలని పిలుపు నిచ్చారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, మండూరు వెంకట నరసయ్య, వెంపాటి చిన్న కొండయ్య (సీతయ్య) పేరుపాలెం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి తెనాలి : పీడిత ప్రజల బానిసత్వ విముక్తికై పోరాటం నిర్వహించిన వీరనారి చిట్యాల ఐలమ్మ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని రజక సంఘాల సమస్యలపై పోరాటం చేయాలని ఎపి రజక వత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య అన్నారు. స్థానిక అయితా నగర్ రజకచెరువు కూడలిలోని ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ భూమికోసం ,భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కొరకు నాడు చిట్యాల ఐలమ్మ పోరాట ఫలితంగా ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలు భూమి పంపిణీ జరిగిందన్నారు. రజకులకు ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చు దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు చెరుకూరి బుచ్చిబాబు ,ఫణిదపు కోటేశ్వరరావు, నీలం శ్రీనివాసరావు, ఎస్ వెంకటేశ్వరరావు, బి చెంచయ్య , ఎం రమణయ్య, ఎం నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



తెనాలిలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

6,7 తేదీల్లో సత్తెనపల్లిలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - మంగళగిరి

అక్టోబర్ 6, 7 తేదీలలో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో జరిగే ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర 11వ మహాసభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ అన్నారు. గురువారం పాత మంగళగిరిలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వలన చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. అందువలన రాష్ట్ర ప్రభుత్వం చేనేతకు రూ.1000 కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సహకార సంఘా లకు చెల్లించాల్సిన యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ రిబేటు బకాయిలు వెంటనే చెల్లించాలని అన్నారు. చేనేతపై జిఎస్టి పూర్తిగా రద్దు చేయాలని, లేదా రియంబర్స్మెంట్ అమలు చేయాలని అన్నారు. సొంత స్థలం ఉన్నవారికి ఇళ్ల నిర్మాణానికి రూ.6 లక్షలు ఉచితంగా ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర మహాసభల్లో ఈ ప్రాంతం నుండి చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి రామారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కే వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి సాదు నరసింహారావు, సహాయ కార్యదర్శి గోల్ దుర్గాప్రసాద్, పట్టణ కమిటీ సభ్యులు జె రవి, జె చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణలో నాయకులు



కోనేటిపురంలో రోడ్డుపై చేరిన వర్షపు నీరు

భారీ వర్షాలకు కొలకలూరులో అంతర్గత రోడ్లు జలమయం

బయటకు వచ్చే వీలులేక భయాందోళనలో స్థానికులు

ప్రజాశక్తి - తెనాలి

మారుతున్న వాతావరణం పరిస్థితులు కారణంగా ఒకవైపు విష జ్వరాలు ప్రబలుతుంటే మరోవైపు గ్రామాలలో జనావాసాల మధ్య నీరు చేరి దోమల తీవ్రత ప్రజలను భయాందోళనలకు గురిచేస్తుంది. రూరల్ గ్రామం కొలకలూరులో రోడ్ల దుస్థితి ఇలా ఉంది. నియోజకవర్గంలో అతిపెద్ద గ్రామమైన కొలకలూరు లో వర్షాలకు అంతర్గత రోడ్లపై నీరు చేరుతుంది. రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. సైడ్ కాలువలు లేక సిమెంటు రోడ్లపైనే నీరు నిలిచిపోతుంది. ఇంటి గడపలకు నీరు తన్ని పట్టడంతో జలచరాలు ఇళ్లలో చేరుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో బీసీ కాలనీలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఇటీవల పర్యటించి, రోడ్లను, సైడ్ కాలువలు లేక రోడ్లపై చేరిన మురుగును పరిశీలించిన సంగతి తెలిసిందే. ఆయన ఆదేశాల మేరకు సైడ్ కాలువల నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. అయితే గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఇంకా గ్రామంలోని కోనేటిపురంలో పెరికల బజారులో భారీగా నీరు నిలిచిపోయింది. సైడ్ కాలువలు లేక నీరు బయటకు వెళ్లే మార్గం లేదు. ఫలితంగా ఇంటి గడపలను తన్నిపట్టి నీరు నిలిచింది. దీంతో పాములు, ఇతర జలచరాలు ఇళ్లలోకి చేరుతున్నాయి. అలాగే కోనేటిపురం ఆంజనేయస్వామి గుడి వీధిలో సైడ్ కాలువలు కూడా పూడుకుపోయాయి. దీంతో గుడి ప్రాంతంలో చిన్నపాటి వర్షానికి కూడా చెరువుల తలపించే రీతిలో రోడ్డుపై నీరు నిలిచిపోతుంది. గతంలో స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో పంచాయితీ తరఫున ఇంజన్లతో నీటిని బయటకు తరలించారు. కానీ కాలువల పూడికతీతకు చర్యలు తీసుకోవడం లేదు. పైగా ఈ ప్రాంతంలో కొందరు సైడు కాలువలకు అడ్డంకులు సష్టిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

కరిముల్లా, పంచాయతీ సెక్రటరీ, కొలకలూరు

గ్రామంలో రోడ్లు అయితే ఎత్తులో ఉన్నాయి. కానీ సైడ్ కాలువల నిర్మాణం జరగలేదు. దీంతో వర్షాలు పడినప్పుడు రోడ్లు ముంపుకు గురవుతున్న మాట వాస్తవమే. పరిశీలించి తాత్కాలికంగా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం.

జిజిహెచ్‌లో డిజిటల్ రేడియోగ్రఫీ మిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో డిజిటల్ రేడియోగ్రఫీ మిషన్‌ను ఎమ్మెల్యే నశీర్ అహ్మద్ గురువారం ప్రారంభించారు. ఎమర్జెన్సీ బ్లాక్‌లో సిటీ స్కాన్ రూమ్ పక్కనే ఈ మిషన్ ఏర్పాటు చేశారు. ఈ మిషను ద్వారా రోజు 400 ఎక్స్ రే లు తీయనున్నారు. 360 డిగ్రీల రేడియోషన్ ప్రామాణికంతో ఈ మిషన్ పనిచేస్తుందని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. రూ.13 లక్షల వ్యయంతో ఎన్‌టిఆర్ వైద్య సేవా పథకం ద్వారా కొనుగోలు చేశామన్నారు.

13న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

13వ తేదీన నిమ్మగడ్డ రామ్మోహన్ రావు విజ్ఞాన కేంద్రం, సింహాద్రి శివారెడ్డి బసవ పున్నయ్యల మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు యు దుర్గారావు, జి బాబు వరప్రసాద్, బి కోటేశ్వరి, కే శివశంకరరావు గురువారం తెలిపారు. పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంథత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తీసుకొని వైద్య శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోగలరని తెలిపారు.

అగ్రహార భూములకు పట్టాలివ్వాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - వినుకొండ



అగ్రహార భూములు సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం వెంటనే పట్టాలు మంజూరు చేసే హక్కులు కల్పించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాల్‌రావు డిమాండ్ చేశారు. నూజెండ్ల మండలం కొండ్రప్రోలు, అప్పాపురం, తిమ్మాపురం గ్రామాల్లో గురువారం నిర్వహించిన రైతు సదస్సుల్లో అగ్రహార భూములు సాగు చేస్తున్న రైతులతో సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ వేలాది కుటుంబాలు తాతలు తండ్రుల కాలం నుండి భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటే నేటికీ ఆయా రైతు కుటుంబాలకు హక్కులు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. అప్పాపురం, కొండ్రప్రోలు, తిమ్మాపురం అగ్రహారం భూముల్లో కొన్ని దశాబ్దాలుగా రైతుల ఇబ్బందులు వర్ణనాతీతమన్నారు. 1956లో ఇనాం ఎబాలిష్ యాక్ట్ వచ్చినా నేటికీ అగ్రహారం భూ సమస్యలు పరిష్కారమవ్వక రైతుల తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం నుండి రాయితీలు అందడం లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇనాం సర్వీస్ భూములను సెటిల్మెంట్ చేస్తున్నామని ప్రకటించడమే తప్ప ఆచరణలో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కొండ్రప్రోలు అగ్రహారం భూములకు 2015లో, అప్పాపురం అగ్రహార భూములకు 2021లో రీసర్వే చేసినా రైతులకు పట్టాలు మంజూరు చేయలేదన్నారు. గతంలో కొంతమందికి రైతులకు ఇచ్చిన పాస్ పుస్తకాలు కూడా రద్దు చేసినట్లు తెలిసిందన్నారు. ఈ సందర్భంగా ఆగ్రహాఇ భూమి సాగు రైతులతో కమిటీలు వేశారు. రైతులు నాగిరెడ్డి, రామిరెడ్డి, శేషగిరి, సత్యనారాయణ, అల్లురెడ్డి, సుబ్బారావు, రైతుసంఘం నాయకులు కె.హనుమంత్‌రెడ్డి, వై.సత్యనారాయణ పాల్గొన్నారు.



యుటిఎఫ్ రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెదకూరపాడు

విద్యారంగంలో సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15-19 తేదీల్లో యుటిఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న రణభేరి పోస్టర్‌ను తాళ్లూరులో ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యాత్ర అనంతరం 25న విజయవాడలో వేలాది మందితో బహిరంగ సభ నిర్వహించి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి అల్టిమేట్ ఇస్తామన్నారు. 12వ పిఆర్‌సి కమిటీకి వెంటనే కమిషనర్ నియమించాలని, డిఎ కూడా విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలు చుట్టూ తిప్పటం విరమించుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో మోడల్ పాఠశాల ఏర్పాటు చేయాలని, అక్కడ నలుగురు లేదా ఐదుగురు ఉపాధ్యాయులుండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి కె.ప్రకాష్, నాయకులు బి.శివశంకర్రావు, సిహెచ్.శ్రీనివాస్‌రెడ్డి, కె.సుబ్బారావు, ఎవి.సతీష్, ఎ.శంకరయ్య, షేక్ ముస్తఫా, జె.నరేష్ పాల్గొన్నారు.



ఫ్లోర్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జాతీయ స్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో తమ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారని కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 4-7 తేదీల్లో బీహార్ రాష్ట్రం ముజాఫరుపూర్ జిల్లాలో నిర్వహించిన జాతీయ స్థాయి ఫ్లోర్ బాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థులు బి.యశస్వినీ, ఎస్.లీలలోహిత అండర్-14 బాలికల జట్టులో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి తృతీయ స్థానం సాధించారన్నారు. అండర్ -14 ఫ్లోర్ బాల్ జాతీయ స్థాయి పోటీలలో ఇండియా టీంలో తమ విద్యార్థిని సోమేపల్లి లీలాలోహిత ఎంపికైనట్లు చెప్పారు. త్వరలో సింగపూర్‌లో జరిగనున్న అండర్-14 బాలికల అంతర్జాతీయ పోటీల్లో ఇండియాకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులను స్కూల్ డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, స్కూల్ ఇన్‌ఛార్జి కోట బాపూజీ, పిఇటిలు ఎం.కిషోర్‌బాబు, పి.మహిత, శేషగిరి అభినందించారు.

గొప్ప దార్శనికుడు సీతారాం ఏచూరి

ప్రజాశక్తి - మాచర్ల



కార్మిక, కర్షక, శ్రామిక, అణగారిన వర్గాల అభ్యున్నతికి పార్లమెంట్లో గొంతెత్తి నినదించడమే కాకుండా, తన వాదనా పటిమతో ప్రత్యర్థి నాయకుల మెప్పును పొందిన గొప్ప దార్శనికుడు సీతారాం ఏచూరి అని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ గురువారం జరిగింది. సీతారాం ఏచూరి చిత్రపటానికి పలువురు పూలమాలలేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని పార్టీలు గుర్తించిన మార్క్సిస్టు మేధావి ఏచూరి అని అన్నారు. అన్ని పార్టీల నాయకులు సైతం అభిమానించే వ్యక్తిత్వం ఆయన సొంతమన్నారు. అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టం రావడంలో ప్రముఖపాత్ర వహించారని చెప్పారు. అభ్యుదయ భావాలు, విప్లవ పోరాటాల కలబోత ఏచూరి అని కొనియాడారు. బిజెపి అనుసరిస్తున్న వైఖరులను ధైర్యంగా ఎదుర్కొని ఇండియా బ్లాక్ ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. మతోన్మాద బిజెపితో దేశానికి ప్రమాదం ఎలా పొంచి ఉందో అందరికీ తెలియజేశారన్నారు. ఏచూరి స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బి.మహేష్, వై.సురేష్, వెంకటరత్నం, వి.వెంకట్రావు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న జిసిడిఒ డి.రేవతి

చదువులో వెనకబడిన విద్యార్థినుల కోసం రైజింగ్ స్టార్

ప్రజాశక్తి-ఈపూరు

మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేస్తున్నామని జిసిడిఒ డి.రేవతి అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు కేజీబీవీ పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. స్టోర్ రికార్డులను, విద్యార్థినుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 24 కేజీబీవీ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులు 920 మంది, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థినిలు 841 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు 740 మంది ఉన్నారన్నారు. 6, 7, 8 వ తరగతుల్లో చదువులో వెనకబడిన 35 మంది విద్యార్థినులకు రైజింగ్ స్టార్ కార్యక్రమం పేరుతో విద్యా నైపుణ్యాలు పెంచేలా ప్రత్యేక శిక్షణిస్తున్నట్లు తెలిపారు. 'విజయ పథం' ద్వారా ప్రతి మంగళ, శనివారాల్లో ఒక సబ్జెక్టుపై తర్ఫీదునిచ్చి పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. 'విద్యాశక్తి' ద్వారా ఐఐటి మద్రాస్ వారితో సబ్జెక్టులలో నైపుణ్యం సాధించేలా జూమ్ క్లాసుల నిర్వహణ ఉంటుందన్నారు. 6వ తరగతి నుండి ఇంటర్ విద్యార్థినులకు పాల్ ల్యాబ్ ద్వారా బోధన జరుగుతోందన్నారు. అనంతరం ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించి ఒకేషనల్ కోర్సు తరగతుల నిర్వహణను పరిశీలించారు.



సెపక్ తక్రా ఉమ్మడి గుంటూరు జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-14 , 17 బాలబాలికల సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 150 మంది క్రీడాకారులు హాజరవగా ఎంపికలను పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్.సురేష్ కుమార్ పర్యవేక్షించారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోయే 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని సురేష్ కుమార్ తెలిపారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా లాకు పిచ్చయ్య, బి.అనిల్‌దత్త నాయక్, కోనంకి కిరణ్ కుమార్ వ్యవహరించారు. ఆదిత్య ఫిజికల్ ఎడ్యుకేషన్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి.కోటేశ్వరరావు, హెచ్ఎం కె.శ్రీనివాసరావు, పిఇటిలు జి.సాంబశివరావు, కె.కిరణ్ కుమార్, జి.తులసీరామ్ నాయక్, ఒ.రత్నాకర్, షేక్ మెహబూబి, కె.స్వాతి, సిహెచ్ అనూష పాల్గొన్నారు

ఆండర్ -14 బాలుర జట్టు

కె.రాము, టి.కళ్యాణ్ బాబు, బి.రత్నాకర్, పి.సన్నీ, యస్.మహేష్, స్టాండ్ బైలుగా.. షేక్.నాగుర్ వలి, యస్.వేణు, జి.పవన్ కుమార్.

అండర్-14 బాలికల జట్టు

పి.శ్రీ జర్షిని, కె.తిరుమల బార్గవి, కె.స్వరూప, కె.ప్రశాంతి, పి.వర్షిని, స్టాండ్ బైలుగా ఎ.వేదవతి, ఆర్.సిరివెన్నెల, కె.మాళవిక.

అండర్ -17 బాలుర జట్టు

కె.శామ్యూల్ రాజు, ఆర్.సంతోష్ కుమార్, యమ్.ప్రభుదాస్, యమ్.శ్రీశాంత్, బి.మనిధర్, స్టాండ్ బైలుగా.. వి.సురేంద్ర, బి.అనీల్ కుమార్, ఎ.కిషోర్.

అండర్ -17 బాలికల జట్టు

పి.గాయత్రి, కె.గీతిక, జి.చిన్మయి, డి.స్వరూప, షేక్ సమీర, స్టాండ్‌బైలుగా ఎ.ప్రశాంతి, పి.దివ్యశ్రీ, జి.వర్ష.

డిఎల్‌పిఒ కార్యాలయాన్ని పరిశీలించిన పంచాయతీ రాజ్ కమిషనర్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లిలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలోలో ఏర్పాటు చేసిన డివిజనల్ డెవలప్మెంట్‌అధికారి కార్యాలయాన్ని పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ గురువారం తనిఖీ చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ గ్రాంట్ నుండి రూ.10 లక్షలు మంజూరు చేయాలని జెడ్‌పి సీఈవో జ్యోతిబసును ఆదేశించారు. డిఎల్‌డిఒ రాజగోపాల్, డిపిఒ నాగేశ్వరనాయక్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఎఇ సింగ్, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి రెహ్మాన్ పాల్గొన్నారు.



డ్రోన్లతో పోలీసుల నిఘా



ప్రజాశక్తి - నరసరావుపేట : కోటప్పకొండ పరిసర ప్రాంతాలు, నిర్మానుష్యమైన ప్రదేశాలను నరసరావుపేట రూరల్ పోలీసులు డ్రోన్లతో గురువారం పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. క్రైమ్ ప్రోన్ ఏరియాలపై డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా కొనసాగుతుందని చెప్పారు. బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట నిర్వహణ, చైన్ స్నాచింగ్, రహదారి దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రదేశాలను ముందుగా గుర్తించి, పాడుపడిపోయిన బంగ్లాలు, తోటలు, బహిరంగ ప్రదేశాలను, పార్కులు, ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి, నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే డయల్ 112 లేదా ఈగల్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం ఇవ్వాలన్నారు.

పోరాటాలతోనే ఐసిడిఎస్ పరిరక్షణ

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకుంటే అక్టోబర్‌లో ఉద్యమం : జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ





అంగన్వాడీ గుంటూరు జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ, హాజరైన ప్రతినిధులు

ప్రజాశక్తి-గుంటూరు

సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం (ఐసిడిఎస్) పరిరక్షణకు అంగన్‌వాడీలు పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా 10వ మహాసభ గురువారం పాతగుంటూరు సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. తొలుత యూనియన్ జెండాను నాయకురాలు టి.రాధ ఆవిష్కరించారు. మహాసభకు ఎం.ధనలక్ష్మి అధ్యక్షత వహించారు. అనంతరం సుబ్బరావమ్మ మాట్లాడుతూ ఐసిడిఎస్ ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు అవుతుందని, ఈ కాలంలో ప్రభుత్వాలు ఈ స్కీమ్‌ను నిర్వీర్యం చేయటానికి అనేక ప్రయత్నాలు చేశాయన్నారు. దేశంలో ఆకలి చావులు పెరుగుతున్నా స్కీమ్‌ను బలోపేతం చేయటానికి ఎలాంటి చర్యలూ చేపట్టలేదన్నారు. ఏటా బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తుందని, బిల్లులు సకాలంలో విడుదల చేయట్లేదన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనాలు కూడా ఇవ్వట్లేదన్నారు. ప్రధాని మోడీ 2014 ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీల వేతనాలు పెంచుతామని, ఐసిడిఎస్‌ను బలోపేతం చేస్తామని వాగ్దానం చేశారని, మూడుసార్లు అధికారంలోకి వచ్చినా చిల్లిగవ్వ పెంచలేదని, పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించారన్నారు. దేశంలో మాతా శిశు మరణాలు, ఆకలి చావులు, నిరుద్యోగం పెరుగుతుంటే అచ్చేదిన్ అంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. ఐసిడిఎస్ ద్వారా పేద గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఎంతో మేలు జరిగిందని అనేక నివేదికలు స్పష్టం చేశాయన్నారు. కావున ఇప్పటికైనా ఈ పథకం ప్రభుత్వాలు బలోపేతానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు.ఎవరి దయాదాక్షిణ్యాలతో హక్కులు రావని, పోరాటాలతోనే సాధించుకోలగమన్నారు.



యూనియన్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకురాలు టి రాధ

రానున్న కాలంలో వేతనాల పెంపు, ఇతర సమ్మె డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని లేదంటే అక్టోబర్‌లో ఉద్యమానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎవిఎన్.కుమారి కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. జిల్లాలో అంగన్‌వాడీ హెల్పర్ ప్రమోషన్లు ఏడాదిన్నర కాలంగా పక్కన పెడితే యూనియన్ సుదీర్ఘ పోరాట ఫలితంగా ప్రమోషన్లు సాధించుకున్నామన్నారు. రానున్న కాలంలో యూనియన్‌ను మరింత బలోపేతం చేసుకొని హక్కుల కోసం పోరాడాలన్నారు. మహాసభలో అంగన్‌వాడీలకు కనీస వేతనాలు రూ.26వేల ఇవ్వాలని, ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలని, అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, యాప్‌ల పనిభారం తగ్గించాలని పలు తీర్మానాలు ఆమోదించారు. ఇటీవల మరణించిన సిఐటియు జాతీయ నాయకులు బాలనందన్‌కు సుబ్బరావమ్మ, వై.నేతాజి పూలమాల వేసి నివాళి అర్పించారు. సభలో రాష్ట్ర నాయకులు రేఖ, జిల్లా గౌరవాధ్యక్షులు రమణ, జిల్లా నాయకులు సుకన్య, ప్రేమలత, రత్నమంజుల, హేమలత, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మణరావు, డి.లక్ష్మీనారాయణ, హుస్సేన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి వెంటనే ప్రకటించాలి

సమస్యల పరిష్కారానికి 18 నుండి దశల వారీ ఆందోళనలు

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులకు తక్షణమే 12వ పిఆర్‌సి వెంటనే ప్రకటించాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు.గురువారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా విస్తృత సమావేశం పూనేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పిఆర్‌సి కాలం ముగిసి రెండేళ్లు కావస్తున్నా ఇంత వరకూ నూతన పిఆర్‌సి ప్రకటించకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. మున్సిపల్ కార్మికుల 2023 డిసెంబర్‌లో చేసిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రిటైర్మెంట్ బెన్ఫిట్స్ రూ.75వేలు, 10 సంవత్సరాలపైన ఎన్ని సంవత్సరాలు ఉంటే ఏడాదికి రూ.2వేలు చొప్పున చెల్లిస్తామని ఒప్పందం చేసుకుందన్నారు. అలాగే దహన సంస్కారాల ఖర్చు రూ.20 వేల రూపాయలకు పెంచుతామని, ప్రమాద మరణానికి ఎక్స్‌గ్రేషియో రూ.7 లక్షలకు పెంచేందుకు ఒప్పందం జరిగిందన్నారు. ఆయా ఒప్పందాలకు సంబంధించి సిఎంను, మంత్రిని, అధికారుల్ని ఆనేక సార్లు కలిసినా ఫలితం లేదన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 18న రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ పట్టణాల్లో ర్యాలీలు, 20, 21, 22 తేదీల్లో విజయవాడలో రిలే నిరాహార దీక్షలు 23న మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ప్రమాదకర మైన పనులు చేసే కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలని అనేకసార్లు కమిషనర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవటం లేదని అన్నారు. జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో 60 సంవత్సరాలు నిండాయని తొలగించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను పనిలో పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చీపుర్లు, కాలవ పారలు, చెప్పులు, కొబ్బరినూనెలు వంటి రక్షణ పరికరాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు యస్.యస్ చెంగయ్య, వెంగమ్మ, మంగళగిరి పద్మ, జయలక్ష్మి, డేవిడ్‌రాజు, మరియదాసు, సిహెచ్ బాలప్రసాద్, షేక్ రసూల్, నరసింహరావు, యాసిర్ ఖాన్, షమ్మీ, డి.పవన్ కుమార్, ఆర్ముగం, కాటంరాజు, రామకష్ణ, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



కుంచనపల్లిలో పారిశుధ్య కార్మికులు నిరసన

పెదకాకాని పారిశుధ్య కార్మికురాలిని దూషించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

పెదకాకాని పారిశుధ్య కార్మికురాలును కులం పేరుతో దూషించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కోరుతూ గురువారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి లో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో పని చేస్తూ, వీధులను శుభ్రం చేస్తున్న పెదకాకాని పంచాయితీ పారిశుధ్య కార్మికురాలని ఆ గ్రామం నివాసి కులం పేరుతో దూషించడం, ఆమెపై దాడి చేయటం దుర్మార్గమన్నారు. దోషులు ఎంత వారైనా పోలీసులు కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులపై అకారణంగా దాడి చేసిన దూషించిన సిఐటియు చూస్తూ ఊరుకోదని, న్యాయపోరాటం చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొక్కిలిగడ్డ ఝాన్సీ రాణి, టి కృష్ణ తులసి, జోజి బాబు, కోటేశ్వరి, ప్రసాద్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

18న విజయవాడలో ఆటో కార్మికుల భారీ నిరసన ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న శివాజీ

ప్రజాశక్తి-గుంటూరు

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా విజయ వాడలో ఆటో కార్మికుల భారీ నిరసన ప్రదర్శ నను విజయవంతం చేయాలని ఆటో రవాణా కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. గురువారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు షేక్.మస్తాన్‌వలి అధ్యక్షతన ఆటో రవాణా కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలిండియా రోడ్‌ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ, సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, ఏపీఎఫ్టియు జిల్లా నాయకులు మేకల రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వాహన మిత్రను పెంచకుండా ప్రకటించి, ఎన్నికల హామీలను చంద్రబాబు ప్రభుత్వం విస్మరించిందన్నారు. అనంతపురంలో సూపర్‌సిక్స్ హిట్ పేరుతో నిర్వహించిన సభలో ఆటో కార్మికులందరికీ దసరా పండుగరోజు వాహన మిత్ర రూ.15వేలు అందిస్తామని చంద్రబాబు ప్రకటించారని, అయితే ఉచిత బస్సు నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు ఉపాధి తగ్గనున్న నేపథ్యంలో వాహనమిత్ర పెంచాలని కార్మిక సంఘాల అభ్యర్థనను చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వం ఓనర్ కం డ్రైవర్లకు మాత్రమే వాహనమిత్ర ఇచ్చారని, ఈ ప్రభుత్వం ఓవన్‌షిప్ లేకపోయినా ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఆగస్టు 15న ఆటో కార్మిక సంఘాలతో చర్చింటానికి ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం అతీగతి లేదన్నారు. జిఒ 21 రద్దు చేయాలని, వాహన మిత్ర పథకాన్ని డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఒక్కరికీ అమలు చేసి, రూ.15 వేల నుండి రూ.30వేలకు పెంచాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు, ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలని అప్పటి వరకూ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. సమావేశంలో స్కూల్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు యం.మురళి, గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జోలెపట్టిన పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - తుళ్లూరు

పెండింగ్ జీతాలు చెల్లించాలంటూ పారిశుధ్య కార్మికులు చేస్తున్న నిరసనలు గురువారం నాటికి నాలుగవ రోజుకి చేరాయి. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కార్మికులు జోలె పట్టి నిరసన తెలిపారు. రెండు నెలల జీతం పెండింగ్ ఉందని, ప్రభుత్వం, సి ఆర్ డి ఎ అధికారులు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని తెలుసుకున్న కిరాణా కొట్టు వాళ్ళు అప్పులు ఇవ్వడం లేదని కార్మికులు వాపోయారు. జీతం రాక, అప్పులు పుట్టక ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాల చెల్లింపులో అలసత్వం వీడాలని జోలెపట్టి నిరసన తెలుపుతున్నామని చెప్పారు. జీతం రూ 21 వేలకు పెంచడంతో పాటు సక్రమంగా చెల్లించాలని కార్మికులు కోరారు.

'చలో తుళ్లూరు సిఆర్‌డిఎ'

రాజధాని పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం 'చలో తుళ్లూరు సి ఆర్ డి ఎ' కార్యక్రమం నిర్వహిస్తున్నామని పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి ఒక ప్రకటనలో తెలిపారు. సిఆర్‌డిఎ ప్రాంతీయ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో పారిశుధ్య కార్మికులు అధికారులకు అర్జీ అందజేస్తామని ఆయన తెలిపారు.



జనసేన కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్స్

డేటా ఎంట్రీ ఆపరేటర్లకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీలో 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్స్ తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మంగళగిరి లోని రాష్ట్ర జనసేన కేంద్ర కార్యాలయం వద్ద రోడ్డుపై ఆందోళన చేశారు. ఏపీ గ్రామపంచాయతీ డేటా ఎంట్రీ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఆందోళన కార్యక్రమం జరిగింది. గత 15 సంవత్సరాలుగా గ్రామపంచాయతీలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె ఏడుకొండలు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో గత 15 సంవత్సరాల నుండి ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించలేదని అన్నారు. గత రెండు ప్రభుత్వాలలోనూ తమ సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమ సమస్యలు పరిష్కరిస్తారని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డేటా ఆపరేటర్లు వచ్చేమని తెలిపారు. తమకు వేతనాలు ప్రభుత్వం ద్వారా కాకుండా పంచాయతీలలో నిధులు ఉంటేనే ఇస్తున్నారని అన్నారు. అలాకాకుండా ఉద్యోగ భద్రత ప్రభుత్వం కల్పించి ప్రభుత్వమే నేరుగా తమకు వేతనాలు వేయాలని అన్నారు. రెండు పర్యాయములు పవన్ కళ్యాణ్ కలిశామని, సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. హామీని నెరవేర్చాలని కోరారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సచివాలయంలో ఖాళీగా ఉన్న డిజిటల్ అసిస్టెంట్ పోస్టులలో తీసుకోవాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ఇక్కడకు రావడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బి రామారావు, ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, సహాయ కార్యదర్శి జి.రవికుమార్, కోశాధికారి టీవీ రాజేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫణిపేర్రాజు

సహకార ఉద్యోగుల పదోన్నతుల పట్ల హర్షం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సహకార ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు కల్పించడం పట్ల ఏపి సహకార ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఫణి పేర్రాజు హర్షం వ్యక్తం చేశారు. నరసరావుపేట ప్రకాష్ నగర్‌లోని జిడిసిసి బ్యాంక్ కార్యాలయంలో రిటైర్డ్ అసిస్టెంట్ రిజిస్టర్ జెపిడి తాండల్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఫణి పేర్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 230మంది సహకార శాఖ ఉద్యోగులకు అత్యంత పారదర్శకంగా పదోన్నతలు కల్పించిన సహకార శాఖ కమిషనర్ అహ్మద్ బాబుకు, రాష్ట్ర సహకార మంత్రి అచ్చం నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ ప్రధాన కార్యదర్శి జి.సురేష్ నాయుడు మాట్లాడారు. అనంతరం సంఘం పల్నాడు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పి.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా డి.రవి కుమార్, ఉపాధ్యక్షులుగా కె.అంజమ్మ, కోశాధికారిగా వి.అశోక్ కుమార్, సభ్యులుగా రమేష్‌లు కో ఆప్షన్ పద్ధతిలో నియమితులయ్యారు.




మాట్లాడుతున్న ఏడీఏ కె.వి.శ్రీనివాసరావు

రైతులు ఆందోళన చెందొద్దు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యూరియా, కాంప్లెక్స్ ఎరువుల గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పూర్తి స్థాయిలో నిల్వాలు ఉన్నాయని నరసరావుపేట ఏడిఏ కె.వి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కొండకావూరు, పమిడిమర్రు గ్రామాలలో యూరియా, ఇతర ఎరువుల వినియోగంపై రైతులతో మాట్లాడి అవగాహన కల్పించారు. యూరియాకు బదులుగా నానో యూరియా వాడకంతో నేల, గాలి కాలుష్యం తగ్గుతుందని తద్వారా పంటలకు ఉపయోగపడే సూక్ష్మ కీటకాలు కాపాడుకోవచ్చున్నారు. పత్తిలో పెనుబంక, పచ్చదోమ, తెల్ల దోమ, పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచిం చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి, వ్యవసాయ విస్తరణ అధికారి కె.బ్రహ్మయ్య, వ్యవసాయ సహాయ సంచాలకులు వరలక్ష్మి, కృష్ణ, గ్రామ నాయకులు వసంత ఎల్లమంద, మేకల సైదారావు రైతులు పాల్గొన్నారు.



కంప్యూటర్ అందజేస్తున్న ఆర్తిమళ్ళ రమేష్

కంప్యూటర్లు వితరణ

ప్రజాశక్తి - పెదకూరపాడు

జిల్లా టిడిపి కార్యదర్శి, మాజీ మండల టిడిపి అధ్యక్షులు ఆర్తిమళ్ళ రమేష్ స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి మూడు కంప్యూటర్లను గురువారం అందించారు. కార్యాలయంలోని ఉన్న కంప్యూటర్లు పాతవి అయి పనిచేయడంలేదని, దీంతో అధికారులు ప్రజలు విజ్ఞప్తి మేరకు లక్ష రూపాయలు విలువచేసే మూడు కంప్యూటర్లను తహశీల్దార్ నీలి ధనలక్ష్మికి అందించారు. రమేష్ గతంలో పాఠశాలలకు ప్లేట్లు గ్లాసులు పంపిణీ చేశారు. ఉన్నత పాఠశాలలో క్రీడా వేదిక తన నిధులతో నిర్మించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మక్కెన సాగర్, మండల బీసీ సెల్ నాయకులు కోరంపల్లి నరేంద్ర పాల్గొన్నారు.







నరసరావుపేట సబ్ జైలు ను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి, రికార్డులు భద్రపరిచిన గదిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

నరసరావుపేట సబ్ జైలును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కోర్టు భవనాల ప్రాంగణంలో ఉన్న సబ్ జైలును జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో ఉన్న ఖైదీల ప్రవర్తన, విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. సబ్ జైలు భద్రతకు సంబంధించి సూపరింటెండెంట్‌కు సూచనలు చేశారు. ఖైదీలతో మాట్లాడి జైల్లో వసతులు, మెనూ ప్రకారం భోజనం అందించడంపై వివరాలు తెలుసుకున్నారు. సబ్ జైలు అధికారులు ఖైదీల హక్కులకు భంగం వాటిల్లకుండా మసలుకోవాలన్నారు. ఖైదీలు సత్ప్రవర్తనవైపు నడిచేలా కార్యక్రమాలు నిర్వహించాలని, జైలు జీవితం అనంతరం మంచి ఉపాధి పొందేలా నైపుణ్య శిక్షణ అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌పి కె.శ్రీనివాసరావు, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం తనిఖీ

అనంతరం కలెక్టర్ తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యాలయం మొత్తంలో ఉన్న రికార్డుల నిర్వహణ గురించి ఆర్డీవో మధులత, తహశీల్దార్ వేణు గోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ రికార్డులను భద్రపరిచేందుకు ఆధునిక పద్ధతులు పాటించాలని ఆదేశించారు.

ఆటల పోటీలలో వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నకరికల్లు శ్రీ వంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఆట్యా-పాట్యా ఆటల పోటీల్లో వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈసందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ బాలికల విభాగంలో బోరుగడ్డ సౌజన్య, షేక్ నజ్మా, పసుపులేటి తిరుపతమ్మ, కొత్తా లక్ష్మీ సరిత, పిన్నెబోయిన స్రవంతి, బాలుర విభాగంలో కాసా శ్రీనివాసరావు, కె.త్రినాధ్‌లు రాష్ట్ర స్థాయి పోటీలలో పల్నాడు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాడెంట్ రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు విద్యతో పాటు ఆట పాటలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన తమ విద్యార్థులు ఈ నెల 25, 26 తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల డైరక్టర్స్ కాట్ల రామ కోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పి.వి.అచ్యుతరావు, పిడి రాయల ఆంజనేయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న రాయల శ్రీనివాసరావు తదితరులు

చెప్పేది ఎక్కువ .. చేసేది తక్కువ..

ప్రజాశక్తి - మాచర్ల

ఎంతో అభివృద్ధి చేశాం, చేస్తున్నామని కూటమి ప్రభుత్వం లేని గొప్పలు చెప్పుకుంటుందని కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం వారి చెప్పే అభివృద్ధి కనపడటం లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజు ఎదో ఒక ప్రాంతంలో ప్రభుత్వం బహిరంగ సభల పేరుతో ధనం వృధా తప్పా ఒరిగేది ఏమీ లేదన్నారు. గత ప్రభుత్వం చేసిన అరాచకాలు, కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొమ్ము కోటేశ్వరరావు, దొడ్డా శ్రీనివాసరావు, వంగపాటి నాగరాజు, శేఖర్ పాల్గొన్నారు.

తెలుగు రైతు విభాగం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల తెలుగు రైతు విభాగం నూతన కార్యవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. కమిటీ అధ్యక్షులుగా కనపర్తి లక్ష్మీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పిన్నింటి రవీంద్రబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరి సదాశివ రావు, షేక్ కరీముల్లా, కామినేని సాయి బాబా యడ్లపాడు మండల సమన్వయ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

న్యాయవాదులుపై దాడులను అరికట్టాలని, తప్పుడు కేసులు నమోదు చేస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూరి అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం కోర్టు విధులను బహిష్కరించి తాలుకా న్యాయస్థానం ప్రాంగణంలో ఉన్న న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలిపారు. న్యాయవాదులు మాట్లాడుతూ కోట దేవదాస్ అనే నందిగామకు చెందిన న్యాయవాదిపై నందిగామ ఎస్ఐ క్రైమ్ నెంబర్ 383 /25 అనే తప్పుడు కేసు నమోదు చేయటాన్ని వ్యతిరేకిస్తూ ఒంగోలు డి.ఎస్.పి. రాయపాటి శ్రీనివాసరావు న్యాయ వాదులను, న్యాయవాద వృత్తిని కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ, తెలంగాణలో సురేష్ బాబు అనే న్యాయవాదిపై ఒక రౌడీ షీటర్ చెందిన చేసిన దాడిని ఖండిస్తూ నిరశన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు న్యాయవాద పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయ వాదులు, చిన్నం మణిబాబు, సయ్యద్ అబ్దుల్ రహీమ్, దివ్వెల శ్రీనివాసరావు, జూపల్లి శేషయ్య, జొన్నలగడ్డ విజయ్ కుమార్, రాజవరపు నరసింహారావు తదితరులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



అవగాహన కల్పిస్తున్న రీడ్స్ సభ్యులు

హెచ్‌ఐవిపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

స్థానిక కె.జి.బి.వి జూనియర్ కాలేజీలో విద్యార్థులకు గురువారం హెచ్‌ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది హెచ్‌ఐవీ వ్యాప్తి మార్గాలు, వ్యాపించని మార్గాలు వివరించి అపోహలను తొలగించారు. చేతులు కలపడం, భోజనం పంచుకోవడం, దోమ కాటుతో హెచ్‌ఐవీ వ్యాప్తి చెందదని స్పష్టతనిచ్చారు. సురక్షిత లైంగిక ప్రవర్తన పాటించడం, కండోమ్ వినియోగం, పరిశీలించిన రక్తం, రక్త ఉత్పత్తులను వాడడం,క్రొత్త సూదులతోనే ఇంజెక్షన్లు తీసుకోవడం, గర్భిణీ స్త్రీలు వైద్యుల సూచనల మేరకు హెచ్‌ఐవీ పరీక్ష చేయించుకోవడం, లాంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రీడ్స్ స్వచ్ఛంద సంస్థ, అవుట్‌రీచ్ వర్కర్లు రమాదేవి, మౌలాబి,పీర్ ఎడ్యూకెటర్ మస్తాన్ బి, కె.జి.బి.వి జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ కవిత, లెక్చర్ రోహిణి, కరుణ, పూర్ణిమ, చందన తదితరులు పాల్గొన్నారు.

మానవీయ విలువల ప్రతిబింబం కూటమి ప్రభుత్వం : చీఫ్ విప్ జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

నేపాల్‌లో ఇటీవల చోటుచేసుకుంటున్న హింసాత్మక ఆందోళనల నేపథ్యంలో అక్కడ చిక్కుకు పోయిన తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడంలో చొరవ కూటమి ప్రభుత్వం మానవీయ విలువలకు ప్రతిబింబమని చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో మంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ పెట్టి నేపాల్‌లోని తెలుగు వారిని రక్షించి, స్వదేశానికి తిరిగి తీసుకువచ్చేలా కృషి చేశారని కొనియాడారు. ఆయన స్వయంగా బాధితులతో ఫోన్‌లో మాట్లాడి, వివరాలు తీసుకుని అధికారులతో సమన్వయం చేయడం, దిల్లీలోని ఏపీభవన్‌లో అత్యవసర హెల్ప్‌లైన్ ఏర్పాటు, నీరు, ఆహారం, వసతి వంటి విషయాల్లో శ్రద్ధపెట్టడం పట్ల బాధిత కుటుంబాలు ధన్యవాదాలు తెలియ జేస్తున్నాయని అన్నారు.

రైతన్నల గురించి మాట్లాడే హక్కు జగన్‌కు లేదు : కన్నా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రైతన్నలకు గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం రాజుపాలెం మండల విస్తృత స్థాయి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూదేశంలో ఎక్కడా లేనటువంటి సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. యూరియా పంపిణీ ఆలస్యం అవుతుందని ఫేక్ పార్టీ, ఫేక్ పత్రిక, ఫేక్ టీవీ తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాజుపాలెం మండల పార్టీ అధ్యక్షులు అంచుల నరసింహారావు, టిడిపి నాయకులు పూజల వెంకట కోటయ్య అంకాళ్ళ ప్రభుదాసు,దరువూరి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండలంలోని గంగలకుంట గ్రామంలో రైతులకు యూరియా, ఎరువుల వాడకంపై వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ గురువారం అవగాహన కల్పించారు.. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధం మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



అందజేస్తున్న జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కిలారి రోశయ్య

జనసేన కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి -మేడికొండూరు

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జనసేన పార్టీ కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల చెక్కును బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు. మండలంలోని డోకిపర్రు గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త సంకు బ్రహ్మయ్య గేదెల వ్యాపారం చేస్తుంటాడు. కొద్ది నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. జనసేన పార్టీ సభ్యత్వ ఇన్స్యూరెన్స్ ద్వారా వచ్చిన 5 లక్షలు చెక్కును బాధితుని భార్యకు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు చేతులమీదుగా గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనసేన పార్టీ నాయకులు కిలారి వెంకట రోశయ్య, తాడికొండ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బేతపూడి విజయ శేఖర్, మండల పార్టీ జనసేన అధ్యక్షులు రాచర్ల నాగబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు కంశెట్టి వెంకటేశ్వరరావు, గట్టు గోపి, ఖరీదు హరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామరాజు

విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సూపర్ సిక్స్ పథకాలను సక్సెస్ ఫుల్ గా అమలుచేసి సూపర్ హిట్‌గా దూసుకు పోతున్న కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరిస్తున్న మంగళగిరి విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్‌కు యర్రబాలెం ఇండస్ట్రీయల్ పార్క్ ఓనర్స్ అసోసియేషన్ గురువారం విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రామరాజు మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు చెల్లించడానికి రెండు రోజులు అదనపు సమయం కావాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోకుండా బుధవారం సాయంత్రం యర్రబాలెం ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో మూడు చిన్న పరిశ్రమల విద్యుత్ కనెక్షన్ కట్ చేయడం బాధాకరమన్నారు. విద్యుత్ శాఖ అధికారులు పరిశ్రమల పట్ల దుందుడుకుగా వ్యవహరించడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందని అన్నారు. మంత్రి లోకేష్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నవ్యంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ మానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎం.కోటేశ్వరరావు, అసోసియేషన్ నాయకులు రావెల శ్రీనివాసరావు మాట్లాడుతూ ముందస్తుగా ఎటువంటి నోటీసు ఇవ్వకుండా కనెక్షన్ ఎలా కట్ చేస్తారని ప్రశ్నించారు. లక్షల రూపాయలు కాషన్ డిపాజిట్ రూపంలో ఉన్నప్పటికీ కంపేనీలకు కరెంట్ కట్ చేయడం దారుణమని, అటువంటి అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సీతారామ శర్మ, కృష్ణారెడ్డి, మనీష్, మునిరెడ్డి, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీ పై చలపతిలో వర్క్ షాప్

ప్రజాశక్తి - తాడికొండ

మోతడక చలపతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఐటిఐ స్టూడెంట్స్ ఈసీఈ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో డ్రోన్ టెక్నాలజీపై రెండు రోజుల వర్క్ షాప్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కొల్లా నాగశ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చర్, నిర్మాణరంగం, మిల్టరీ విభాగాలలో డ్రోన్ ఉపయోగాలను ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థులు సొంతంగా డ్రోన్ తయారీ విధానం, డ్రోన్ టెక్నాలజీ తాజా పురోగతులు వివరించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ వ్యవసాయ రక్షణ నిఘా, విపత్తు నిర్వహణలో డ్రోన్ డిజైన్ అసెంబ్లీ నియంత్రణ వ్యవస్థలు నిబంధనలు గురించి వివరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఆర్ అండ్ డీన్ డాక్టర్ బాల మురళీకృష్ణ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారులు అధ్వానం



కొండవీడు వెళ్లే రహదారి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఫిరంగిపురం గ్రామపంచాయతీ నుండి పర్యాటక కేంద్రమైన కొండవీడు, పుట్టకోట, హౌస్‌గణేష్ తదితర గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతల మయంగా మారి వాహనదారులు, స్థానికులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ తటాకాలను తలపిస్తున్నాయి. దీనికితోడు గుంతలు పడి వాహనదాలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని కొండవీడు కోటను సందర్శించే పర్యాటకులు, స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ఎన్నో ప్రమాదాలు జరిగాయని, దోమలు క్రిమి కీటకాల వలన అనేక రోగాలను బారిన పడుతున్నామని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించి, పర్యాటకుల, ప్రజల ప్రాణాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం : సిఐటియు



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పోరాటాలతోనే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు రూరల్ కార్యదర్శి యు.దుర్గారావు అన్నారు. గురువారం పెద్దవడ్లపూడి పీహెచ్సిలో జి.వాణి అధ్యక్షతన ఆశావర్కర్ల సమావేశం జరిగింది. దుర్గారావు మాట్లాడుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్ సంఘటితంగా పోరాటాలు చేసిన ఫలితంగా ప్రభుత్వం జీవో నెంబర్ 94 ను విడుదల చేసిందని ఈ జీవో ద్వారా ఆశా వర్కర్స్ వయో పరిమితిని 62 సంవత్సరాలకు పెంచారని, వేతనంతో కూడిన 180 రోజులు మెటర్నీ లీవ్ శాంక్షన్ చేశారని, ఆశా వర్కర్లకు 1,50,000 రూపాయలు గ్రాడ్యుటి ఇచ్చేందుకు అంగీకరించారని తెలిపారు. అనంతరం 9 మందితో గ్రామ ఆశా వర్కర్ల యూనియన్ కమిటీకి అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.సుమనశ్రీ, బి.సీత, ఉపాధ్యక్షురాలుగా బి.రాణి, సహాయ కార్యదర్శిగా ఎన్.పద్మ, కోశాధికారిగా జి.వాణి ఎన్నికయ్యారు. సమావేశంలో విజయ రాణి, లావణ్య, ఎస్తేరు, రజని పాల్గొన్నారు.

పస్తులుంటూ... పాచి పనులు చేయాల్సిందేనా?

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

చాలీ చాలని జీతాలతో పస్తులుండి పాచి పనులు చేయాల్సిన దుస్థితిలో పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారని సిఐటియు తాడేపల్లి మండల సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఎం.టి.ఎం.సి పరిధిలోని చిర్రావూరు గ్రామంలో పారిశుద్ధ్య కార్మికుల విస్తృత సమావేశం నిర్వహించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఆప్కాస్‌లో చేర్చని పారిశుద్ధ్య కార్మికులకు పదివేల రూపాయల వేతనం ఇవ్వడం సరైనది కాదన్నారు. వెంటనే ఆప్కాస్‌లో చేర్చని పారిశుద్ధ్య కార్మికులను చేర్చి కనీస వేతన చట్ట ప్రకారం 26 వేల రూపాయలు ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేస్తుందన్నారు. సిఐటియు తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ కార్మికుల రిటైర్మెంట్ ఏజ్ 65 సంవత్సరాలకు పెంచాలని అన్నారు. రిటైర్డ్ బెనిఫిట్స్‌తో పాటు, రిటైర్డ్ కార్మికుల కుటుంబాలలో పారిశుద్ధ్య పని ఇవ్వాలన్నారు. అనంతరం చిర్రావూరు పారిశుధ్య గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మిక సంఘం గ్రామ అధ్యక్షులుగా ఎల్.రాంబాబు, కార్యదర్శిగా మిక్కాయల్, ఉపాధ్యక్షులుగా నూతక్కి సామ్రాజ్యం, సహాయ కార్యదర్శిగా శివాజీ, కోశాధికారిగా ప్రాతూరు అశోక్ ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న దొంతిరెడ్డి వెంకటరెడ్డి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - చేబ్రోలు

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని , చేసిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తారని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఊర్మిళ, డాక్టర్ శైలజ అన్నారు. గురువారం చీలిపాలెం నమూనా ప్రభుత్వ పాఠశాలలోలో బాల్య వివాహాలు అంశంపై గ్రామస్తులకు, విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్య అధికారులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు మాట్లాడుతూ ప్రస్తుత సమాజం ఎంతో శరవేగంగా అభివృద్ధి చెందుతున్నా కానీ, ఇంకా బాల్యవివాహాలు నమోదు కావడం దురదృష్టకరమని అన్నారు. చిన్న వయసులో వివాహాలు చేయటం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని పేర్కొన్నారు . ఈ సందర్భంగా బాల్యవివాహాలు చేసిన వారికి చేయించిన వారి పై కూడా చట్టరీత్య కేసులు నమోదు చేస్తారని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ బాల్యవివాహాల నిర్మూలనకు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు డాక్టర్ అవ్వారి భద్రావతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, బాలిక యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి - తాడికొండ

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.కృష్ణకుమారి అన్నారు. తాడికొండ గ్రామంలోని ఎంపీయూపీ నార్త్ స్కూల్‌లె విద్యార్థులకు బేటి బచావో బేటి పడావోపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసిన వారికి లక్ష రూపాయల వరకు జరిమానా ఒక సంవత్సరం జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్.ప్రమీల, వాసవి ఉమామహేశ్వర్ రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

వర్ష కాలంలో వచ్చే సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వివిధ ఆసుపత్రులకు చెందిన డాక్టర్ల బృందం ప్రజలను హెచ్చరించారు. మండలంలోని పెదపాలెం గ్రామంలో కోనేరు లక్ష్మయ్య ఇంజనీరింగ్ కాలేజీ నేషనల్ సర్వీస్ సేవ పథకంలో భాగంగా గురువారం ఆస్టర్ రమేష్ అమరావతి నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో పెదపాలెం గ్రామంలో జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన డెంగు మలేరియా, టైఫాయిడ్ పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు రకరకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు ప్రతాపరెడ్డి ఎముకల వైద్య నిపుణులు చేతన్ జనరల్ మెడిసిన్ కు చెందిన దీప్తి ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో పెద్దపాలెం గ్రామ సర్పంచ్ పాటిబండ్ల కృష్ణప్రసాద్, గ్రామ కార్యదర్శి వెంకట్రావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీకాంత్ రెడ్డి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సురేష్, నందన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

282వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 282 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియు పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ కార్యదర్శి కె.స్టీవెన్, ఆదినారాయణ, పిచ్చయ్య, వై.సాంబశివరావు ప్రారంభించారు. దీక్షల్లో సాలి లాజర్ బాబు, పుష్పలీల, బొందలపాటి నవనీతమ్మ, దర్శి నాగమల్లేశ్వరి, మధిర మరియమ్మ కూర్చున్నారు, కార్యక్రమంలో షేక్ సుభాని, బి.అంకయ్య, డి.నాగేశ్వరరావు, ఇస్మాయిల్, దేవా, వై.సుబ్బారావు, హగ్గయ్య, సూర్య ప్రకాష్, మహిళలు పాల్గొన్నారు.



కాల్వ గట్టుకు మర్మతులు చేపట్టిన అధికారులు

కాల్వ గట్టుకు మరమ్మతులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక పాతలాకుల వద్ద అలీనగర్ సమీపంలో కోతకు గురవుతున్న కాలువ గట్టుకు గురువారం నీటి సంఘాల ఆధ్వర్యంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఖరీఫ్ సీజన్ కావటంతో కాలువకు పూర్తిస్థాయిలో సాగునీటిని విడుదల చేస్తున్నారు. దీనితో తుంగభద్ర (మద్రాస్) కాలువ ఎడమ గట్టు కోతకు గురైంది. బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు కాలువలకు విడుదల చేస్తున్న నీటి పరిమాణాన్ని తగ్గించారు. దీనితో ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. కాలువ గట్టుకు గోడ కట్టడానికి రెండు కోట్ల రూపాయలు మంజూరు అయినట్లు ఏఈ ఎల్.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘాల అధ్యక్షులు గొర్నేని అనిల్, సిబ్బంది లక్ష్మణ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో సినీ పరిశ్రమ అభివృద్ధి ప్రశ్నార్థకం

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధి ప్రశ్నార్థకంగా ఉందని దర్శకులు దిలీప్ రాజా అన్నారు. రూరల్ పరిధిలోని పెదరావూరులో గురువారం ఆయన మాట్లాడుతూ మహానటుడు ఎన్టీఆర్ స్థాపించిన టిడిపి అధికారంలో ఉండగా, మరోవైపు నటుడు పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నా ఏడాది కాలంగా సినీ పరిశ్రమ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సినీ పరిశ్రమకు కావాల్సిన మౌళిక సదుపాయల కల్పనలోనూ జాప్యం జరుగుతోందన్నారు. ప్రభుత్వంతో ఏవైనా చర్చలు జరిగే సందర్భంలో ఎపి ప్రాతినిధ్యం లేకుండా తెలంగాణ సినీ పెద్దలతో మాత్రమే సమావేశం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మృతదేహాలు వెలికితీత

ప్రజాశక్తి - తాడేపల్లి



మృతదేహాలను వెలికి తీస్తున్న పోలీసులు, ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది

స్థానిక అమరారెడ్డి నగర్ సమీపంలో, బకింగ్ హామ్ కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహాలను తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు, ఎస్ఐ. ఎస్.కె. ఖాజావలి, ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది కాలువలో నుండి గురువారం వెలికి తీశారు. పోస్టుమార్టం కోసం మంగళగిరి ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముందస్తు అనుమతులపై జెడ్పీటిసిల ఆగ్రహం

జెడ్పీ స్థాయి సంఘ సమావేశాల్లో ఛైర్మన్‌ను నిలదీసిన పలువురు జెడ్పీటిసిలు

ప్రజాశక్తి-గుంటూరు

జెడ్పీటిసిలను సంప్రదించకుండా జెడ్పీ ఛైర్మన్ ముందస్తు ఆమోదంతో పనులు మంజూరు చేసి, ఇప్పుడు సంతకాలు చేయాలని చెప్పటం ఏంటని జెడ్పీటిసిలు నిలదీశారు. గుంటూరు జిల్లా పరిషత్తు కార్యాలయంలో గురువారం జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించారు. ఏడు స్తాయి సంఘాలలో మూడవ స్థాయి సంఘం కోరం లేక వాయిదా పడగా మిగిలినవి యధావిధిగా జరిగాయి. ముందస్తు అనుమతులతో పనులు చేపట్టంపై నర్సరావుపేట, నాదెండ్ల, అచ్చంపేట జెడ్పీ టిసిలు చిట్టిబాబు, మస్తాన్‌రావు, విజయ ప్రతాప్‌రెడ్డి ఛైర్మన్‌ను ప్రశ్నించారు. చాలా సేపటి వరకూ సంతకాలు చేయబోమని చెప్పారు. ఛైర్మన్, అధికారులు వారికి సర్ధిచేప్పే ప్రయత్నం చేశారు. జెడ్పీటిసిల ప్రతిపాదనలు కూడా పరిగణిస్తామని ఛైర్మన్ చెప్పటంతో వారు శాంతించారు. సమావేశ ప్రారంభంలో కొందరు జడ్పిటిసిలు తమకు సమాచారం ఇవ్వకుండానే వేలంపాటలు అధికారులు నిర్వహిస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిని పరిష్కరిస్తానని జడ్పీ ఛైర్మన్ హెనీ క్రిస్టినా వారికి హామీ ఇవ్వడంతో వివిధ అంశాలపై ప్రశాంతంగా చర్చ జరిగింది. 1, 7, 2, 4 స్థాయి సంఘ సమావేశాలకు జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షత వహించారు. ప్రణాళిక, ఆడిట్, గ్రామపంచాయతీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్యం, రహదారులు భవనాలు, జిల్లా నీటి యాజమాన్య వివిధ అంశాలపై చర్చ జరిగింది. తురకపాలెంలో జరిగిన సంఘటనపై ప్రజలు దేనివలన అనారోగ్యం పాలై చనిపోయారని జడ్పీ ఛైర్మన్ ఆరోగ్యశాఖ అధికారులను అడిగారు. దానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అధికారులు సమావేశంలో వివరించారు. అదేవిధంగా పల్నాడు జిల్లాలో ఒక కేసు వచ్చిందని అధికారులు తెలిపారు. దీనిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించామన్నారు. తురకపాలెంలో నీటి సరఫరాకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకున్నారని రూరల్ వాటర్ స్కీమ్ ఎస్ఈ కళ్యాణ్ చక్రవర్తిని ఛైర్మన్ ప్రశ్నించారు. దాని గురించి తగు జాగ్రత్తలు తీసుకున్నామని ఆయన తెలిపారు. పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ మాట్లాడుతూ జిల్లా పరిషత్తు ఆధ్వర్యంలో ముద్రించిన విద్యాజ్యోతి పుస్తకం వలన జడ్పీ హైస్కూల్ విద్యార్థిని 599 మార్కులు సాధించిందని, అలాగే 577 మార్కులు సాధించిన విద్యార్థులు 100 మందికి పైగా ఉన్నారని వివరించారు. గుంటూరు జిల్లా డీఈఓ రేణుక మాట్లాడుతూ విద్యార్థులకు అందించే యూనిఫామ్, భోజన విషయాలను సమావేశంలో వివరించారు. సమావేశంలో సీఈఓ జ్యోతిబస్, ఓఎస్డి శివన్నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. యూరియా కొరత లేకుండా చూడాలని, జల్‌జీవన్‌మిషన్ పనులు వేగవంగా జరిగేలా చూడాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్, జెడ్పీటిసిలు, అధికారులు



ఎస్ఆర్ఎం వర్సిటీలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీలో గురువారం సాయంత్రం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ సతీష్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఇంజనీరింగ్ లిబరల్ ఆర్ట్స్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని వారి ఉజ్వల భవిష్యత్తు కోసం అధునాతన పాఠ్యాంశాలతో కూడిన విద్యను అందుబాటులో ఉంచామన్నారు. ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీలో తరగతి గదులు, హాస్టల్ సదుపాయం, రవాణా సౌకర్యాలు తదితరువన్నీ విద్యార్థులకు అనుగుణంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హాస్టల్, మెస్ ఏరియాలో క్యూఆర్ కోడ్ ను అందుబాటులో ఉంచనున్నామనీ, ఇకమీదట విద్యార్థులు తమ సమస్యలు సూచనలు దీని ద్వారా తెలియపరిచే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సర్ హాలో పేరిట విద్యార్థులు నిర్వహిస్తున్న నూతన విద్యార్థుల పరిచయ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్టూడెంట్ కౌన్సిల్ ఉద్భవ్ పేరిట తయారుచేసిన మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్ స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ మేజర్ జనరల్ గురుప్రీత్ సింగ్ అసోసియేట్ డైరెక్టర్ రేవతి బాలకృష్ణ , స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ నివేద శ్రీరామ్ హెచ్ఆర్ డైరెక్టర్ ఐజక్ సామల తదితరులు పాల్గొన్నారు.

వర్షాల సమస్యలపై ఫిర్యాదులకు

జిఎంసిలో కాల్ సెంటర్

ప్రజాశక్తి-గుంటూరు



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నగర ప్రజలు వర్షాల వలన ఏమైనా సమస్య ఎదుర్కొంటే 24 గంటలూ అందుబాటులో ఉండేలా గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్(0863- 2345103) నంబర్‌లో సంప్రదించా లని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం నల్లపాడు రోడ్ అవుట్‌ఫాల్ డ్రైన్, శ్రీరామ్ నగర్ రోడ్ ఆక్రమణల తొలగింపు, ఎస్వీఎన్ కాలనీ, విద్యా నగర్ ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యల పై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. వర్షాల వలన లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల వలన సమస్యలు ఉంటే 24 అందుబాటులో ఉండే జిఎంసి కాల్ సెంటర్‌కి ఫిర్యాదు చేయవచ్చన్నారు. విద్యుత్ అంతరాయం వలన తాగునీటి సరఫరాకు సమస్య రాకుండా ఏఈల వారీగా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అవుట్ ఫాల్ డ్రైన్లలో వ్యర్థాలు నిలిచే ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఎస్వీఎన్ కాలనీ, నల్లపాడు రోడ్ వంటి ప్రాంతాల్లో ఫ్రీ లెఫ్ట్, రైట్‌ల వద్ద ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సిఆర్‌డిఏకు బెస్ట్ యూజర్ ఆర్గనైజేషన్ అవార్డు

ప్రజాశక్తి - తుళ్లూరు



అవార్డు అందుకున్న సి ఆర్ డి ఎ ప్లానింగ్ విభాగం డైరెక్టర్ సురేష్ కుమార్, జిఐఎస్,ఆర్ ఎస్ ఎ సిబ్బంది

జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జిఐఎస్), రిమోట్ సెన్సింగ్ అసిస్టెంట్ టెక్నాలజీ (ఆర్ ఎస్ ఎ)ల వినియోగంలో విశేష ప్రతిభ కనబరిచిన (ఆంధ్ర ప్రదేశ్ కాపిటల్ రీజియన్ డెవలప్ మెంట్) ఎ పి సి ఆర్ డి ఎ కు ప్రతిష్టాత్మకమైన బెస్ట్ యూజర్ ఆర్గనైజేషన్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో సెప్టెంబర్ 10న ది పార్క్ హోటల్‌లో జరిగిన 'ఎస్రి ఇండియా' సంస్థ వార్షిక యూజర్ కాన్ఫరెన్స్‌లో ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అజేంద్ర కుమార్ ఈ అవార్డును సిఆర్‌డిఎ ప్లానింగ్ విభాగ డైరెక్టర్ (ఎఫ్ ఎ సి) బి సురేష్ కుమార్, జి ఐ ఎస్, ఆర్ ఎస్ ఎ విభాగ సిబ్బందికి అందజేశారు. సిఆర్‌డిఎ పట్టణ ప్రణాళిక, అమరావతి నగర నిర్మాణం, అభివృద్ధిలో జియోస్పేషియల్ టెక్నాలజీని సజనాత్మకతో సమర్థవంతంగా వినియోగిస్తున్నందున ఈ అవార్డు లభించింది. డేటా ఆధారిత సేవలు, పట్టణాభివృద్ధికి అత్యాధునిక జి ఐ ఎస్, ఆర్ ఎస్ ఎ టెక్నాలజీని వినియోగించడంలో సి ఆర్ డి ఎ నిబద్ధతను అవార్డు ప్రతిబింబిస్తోందని సి ఆర్ డి ఎ కమిషనర్ కన్నబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విజ్ఞాన్‌లో ఘనంగా కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్

ప్రజాశక్తి-గుంటూరు

కొరియన్ భాషాభ్యాసం కొనసాగిస్తూ, ఉన్నతస్థాయి ప్రావీణ్యం సాధించడం ద్వారా భారత విద్యార్థులు, యువతకు కొరియా, కొరియన్ కంపెనీలతో భవిష్యత్తు అవకాశాలను విస్తరించుకోవచ్చని చెన్నైలోని కౌన్సిల్ జనరల్ ఆఫ్ ద రిపబ్లిక్ ఆఫ్ కొరియా చాంగ్-న్యూన్ కిమ్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ స్టూడెంట్ అఫైర్స్ ఆధ్వర్యంలో కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. చాంగ్ న్యూన్ కిమ్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ దేశాల మధ్య నెలకొన్న పోటీ పరిస్థితుల్లో ఆసియా ఖండంలో భారతదేశం, కొరియా కీలక భాగస్వాములని పేర్కొన్నారు. భద్రతా రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రజల మధ్య పరస్పర సంబంధాలను విస్తరించడం అత్యవసరమన్నారు. కొరియా సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని, అంతర్జాతీయ స్థాయిలో కొరియన్ సినిమా ప్రతిభను, సాంస్కృతిక వైవిధ్యాన్ని భారతదేశ ప్రజలు విపరీతంగా ఆదరిస్తున్నారని తెలిపారు. భావోద్వేగ ప్రధానమైన డ్రామాలు, యాక్షన్ థ్రిల్లర్లు, హాస్య చిత్రాలు, అలాగే కుటుంబమంతా చూసే వినోదాత్మక సినిమాలు మాత్రమే కాకుండా, కొరియా సమాజం, సంస్కృతి, జీవనశైలి, విలువలను కూడా ప్రతిబింబిస్తాయన్నారు. కొరియన్ సంస్కృతి ప్రత్యేకతలైన కే-పాప్, కే-డ్రామా, కే-ఫుడ్, కే-కాస్మటిక్ వంటి వాటిని విద్యార్థులతో పంచుకున్నారు. కొరియన్ సంగీతం కే-పాప్ ద్వారా ఆకర్షణీయమైన సంగీతం, అద్భుతమైన డాన్స్ ప్రదర్శనలు, స్టైలిష్ కాన్సెప్ట్‌లు అందించడం వీటి ప్రత్యేకతని తెలియజేసారు. బీటీఎస్, బ్లాక్ పింక్, ఎక్సో వంటి బ్యాండ్లు ప్రపంచ యువతలో సంచలనం సష్టించాయన్నారు. టెలివిజన్, సౌందర్య ఉత్పత్తులు, వంటకాలు గురించి వివరించారు. 'కిమ్చి' (ఫెర్మెంటెడ్ వెజిటేబుల్ డిష్), 'బిబింబాప్' (రైస్‌తో మిక్స్ చేసిన కూరగాయలు),"టోక్‌బోకి' (రైస్ కేక్ వంటకం) ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకున్నాయన్నారు. తెలియజేసారు. ఈ ఫెస్టివల్‌లో కొరియా సంస్కతి, సినిమాలు విద్యార్థులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.




సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థినులు

వివిటిలో నేషనల్ సింపోజియం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలోని విఐటి విశ్వవిద్యాలయంలో గురువారం నేషనల్ సెమీ కండక్టర్ టెక్నాలజీ సింపోజియం -2025 ఘనంగా ప్రారంభమైంది. 11 నుండి 13 తేదీ వరకు సింపోజియంను విఐటి విశ్వవిద్యాలయం, ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్నాయి. నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ-విద్యా సహకారంపై దృష్టి సారించడం ద్వారా భారతదేశం యొక్క సెమీకండక్టర్ ప్రస్థానాన్ని ముందుకు తీసుకువెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. సింపోజియంలో 400 మంది ప్రతినిధులు, జాతీయ, అంతర్జాతీయ కంపెనీల నుండి 20 మందికి పైగా పరిశ్రమ ప్రతినిధులు పాల్గొంటారు. గురువారం మొదటిరోజు విశ్వవిద్యాలయం విఎల్ ఎస్ ఐ పి ఆర్ ఓ టెక్నాలజీస్, ఇన్వెంటిజ్, సాయంట్ ఇండియా, డబ్ల్యూ ఎన్ పి సెమికాన్ ఎల్ ఎల్ పి అనే నాలుగు మార్గదర్శక కంపెనీలతో వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు (ఎంవోయు) కుదుర్చుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె మధుమూర్తి మాట్లాడుతూ, స్మార్ట్‌ఫోన్‌ల నుండి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే పరికరాల వరకు సెమీకండక్టర్లు ఆవిష్కరణలతో ముడిపడి ఉన్నాయన్నారు. సిఐఐ ఆంధ్ర ప్రదేశ్ వైస్ ఛైర్మన్, అపెక్స్ సొల్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరేంద్ర కె శరణం, మాట్లాడుతూ,ఈ సింపోజియం భారతదేశ కేంద్రీకత ఆవిష్కరణలను పెంపొందించడానికి, సాంకేతిక సరిహద్దుల యొక్క విస్తారమైన సామర్థ్యాన్ని అన్‌లాక్ చేయడానికి ఒక మార్గదర్శిగా నిలుస్తుందని అన్నారు. ఇంద్రజిత్ అన్నే (ఐ టి ఎ ఎ పి అధ్యక్షులు, సి ఈ - ఇన్వెంటిజ్) మాట్లాడుతూ, భారతదేశ సాంకేతిక పారిశ్రామికవృద్ధికి కీలకమైన రంగం, సెమీకండక్టర్ టెక్నాలజీలోని తాజా ధోరణులు, ఆవిష్కరణలు సవాళ్లపై చర్చించడానికి దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులను ఒకచోట చేర్చడం ఈ జాతీయ స్థాయి కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డి రామకృష్ణ, విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్ వి కోటా రెడ్డి, సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు, సీమెన్స్ చీఫ్ మేనేజర్ శరవణన్ జయరామన్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న విట్, పలు సంస్థల ప్రతినిధులు